సాక్షి
మెదక్

శనివారం । 4 । నవంబర్ । 2023



అందోల్‌లో గెలుపెవరిది?
రాష్ట్ర రాజకీయాల్లో 'అందోల్' నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది.
వివరాలు IIలో ▸



ఆ ఆరుగురి చుట్టే నర్సాపూర్
నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గం 1952 సంవత్సరంలో ఏర్పాటైంది.
వివరాలు IIలో ▸



కొంత మందికే రుణమాఫీ
కొంత మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని మండల వ్యవసాయ అధికారి సతీశ్ అన్నారు.
వివరాలు IIIలో ▸

హోరాహోరీ ప్రచారం

- మెదక్‌లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ
- ఓటర్లను ఆకర్షించేందుకు యత్నం
- ప్రచారానికి సిద్ధమవుతున్న బీజేపీ

మెదక్: నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలోని పల్లెపల్లెనా అభ్యర్థులు హోరెత్తిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచే ప్రచారాన్ని ప్రారంభించి రాత్రి 7 గంటల వరకు కొనసాగిస్తున్నారు. అధికార బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి రెండు నెలలుగా ప్రచారం సాగిస్తున్నారు. అలాగే కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావుకు 20 రోజుల క్రితం టికెట్‌ను కేటాయించగా రోహిత్‌తో పాటు ఆయన సతీమణి శివాణిరెడ్డి సైతం ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థులు వ్యూహ ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నారు. గతానికి భిన్నంగా ఆత్మీయ సమ్మేళనాలు, సామాజికవర్గాల వారీగా సభలు, సమావేశాలను గ్రూపు సమావేశాలకు ప్రాధాన్యమిస్తుండటం గమనార్హం. ప్రచార ర్యాలీలు, రోడ్‌షోలు ఇంటింటి ప్రచారాలు, బహిరంగ సభలు చేపడుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరిస్తున్నారు. అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమంటూ స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం విజయభేరీ పేరుతో సెప్టెంబర్ 29న, మెదక్ రాందాస్ చౌరస్తాలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలు మెదక్, నర్సాపూర్ అభ్యర్థులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారాలతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్ నింపారు. సోనియాగాంధీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను పక్కా అమలు చేస్తామని, కాంగ్రెస్ ను గెలిపించాలని వారు చెబుతున్నారు. అదే స్ఫూర్తితో కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌దంపతులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీజేపీ అభ్యర్థిగా పంజావిజయ్ కుమార్‌కు ఈనెల 2న, టికెట్ కేటాయించారు. అతను సైతం ప్రచారాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.





ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్‌రావు

కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలే..

మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మ

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ వస్తే రైతులకు కరెంట్ కష్టాలు తప్పవని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఖాజాపూర్ తండా, ఖాజాపూర్, కుమ్మరిపల్లి, రామాయపల్లి, శాలిపేట, చెన్నాయిపల్లి, వెంకట్రావుపల్లి, మడూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించగా, మహిళలు బోనాలతో ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుబంధు, రైతుబీమా అందించడంతో పాటు తాజాగా ప్రతి ఇంటికి బీమా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆసరా పింఛన్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. మెదక్‌లో మైనంపల్లిని రెండుసార్లు గెలిపిస్తే కన్పించకుండాపోయి.. మళ్లీ ఇప్పుడు వచ్చి గ్రామాల్లో చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు కుంట నాగలక్ష్మి, జంకుబాయి, ఉపేందర్‌రెడ్డి, కిష్టారెడ్డి, పోచయ్య, నర్సమ్మ, ఎంపీటీసీ బాప్పల్లి యాదగిరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏకే గంగాధర్‌రావు, రమణ, పట్లోరి రాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు నర్సాపూర్‌కు హోంమంత్రి రాక

నర్సాపూర్: హోంమంత్రి మహమూద్ అలీ శనివారం నర్సాపూర్‌కు రానున్నారు. మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొంటారని జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్ తెలిపారు. నియోజకవర్గంలోని మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు హబీబ్‌ఖాన్, లాయక్, ఇబ్రహీం, షేక్ హుస్సేన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు గడువు పెంపు

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ, ప్రైవేట్, సెక్టార్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలను ఈనెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ విద్యాశాఖ కమిషన్ ఆదేశాల మేరకు ప్రవేశాల కోసం ఈ గడువు పెంచినట్లు తెలిపారు. జిల్లాలో పదో తరగతి పాసైన విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొదటి రోజు నామినేషన్లు నిల్

మెదక్: ఎన్నికల నామినేషన్ల శుక్రవారం ప్రారంభమైంది. మొదటి రోజు మెదక్‌లో ఒక నామినేషన్ దాఖలు కాలేదు. ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు తెలిసింది. ఆ నాలుగు రోజులు అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయ్యే అవకాశం ఉంది.

నామినేషన్ల కోసం పటిష్ట బందోబస్తు



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ

నర్సాపూర్: నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి చెప్పారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కార్యాలయం ఆవరణతో పాటు ఆఫీసుకు వంద మీటర్ల దూరంలో బ్యారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు ఐదుగురిని లోపలకు పంపుతామని పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు ఆయా రాజకీయ పార్టీల నాయకులు తమతో సహకరించాలని ఆయన కోరారు.

జాతీయ చాంపియన్‌షిప్‌కు జిల్లా క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న నారాయణగుప్తా

తూప్రాన్: ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు జమ్మూకాశ్మీర్‌లోని శ్రీనగర్ బాక్షి మైదానంలో జరగనున్న 45వ జాతీయ స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొనే తెలంగాణ పురుషుల జట్టుకి జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కొడిప్యాక నారాయణగుప్తా పేర్కొన్నారు. గత నెల స్థానిక గురుకుల పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, హన్మకొండలో జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొని తుది జట్టుకు క్రీడాకారులు బానోత్ సుమన్, భాస్కర్, నవీన్, అరవింద్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను నారాయణ గుప్తా, ఉపాధ్యక్షులు అజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ శర్మ, కోశాధికారి గోవర్ధన్‌గౌడ్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సిబ్బంది

మనోహరాబాద్ (తూప్రాన్): ఎన్నికల నేపథ్యంలో కామారెడ్డి జిల్లాలో ప్రచారానికి వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కారును మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులో చెక్‌పోస్టు వద్ద ఎన్నికల అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వారికి సహకరించారు.

పాత పింఛన్ పునరుద్ధరించండి

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్
- ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో ధర్నా

మెదక్ కలెక్టరేట్: పాత పింఛన్ పథకాన్ని(ఓపీఎస్) పునరుద్ధరించాలని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ డిమాండ్ చేశారు. అఖిల భారత, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో శుక్రవారం పింఛన్ చైతన్య మహార్యాలీ పేరిట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త పింఛన్ పథకాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. అనంతరం నరేందర్ మాట్లాడుతూ రిటైర్‌మెంట్ తర్వాత తమ జీవితానికి భరోసానిచ్చే పాత పింఛన్ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. ఇన్‌కమ్ టాక్స్ పరిమితి పెంపు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, టీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణగౌడ్, కస్తూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు నర్సింహారెడ్డి, కోశాధికారి శ్రీనివాసరావు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్, నాయకులు

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తాం

నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): ఆడబిడ్డను ఆశీర్వదించి ఎమ్మెల్యేను చేస్తే మరింత అభివృద్ధి చేస్తామని నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తునికి, హరిచంద్‌తండా, ముట్రాజ్‌పల్లి, రాజిపేట, వెంకటాపూర్, జాజితండా, కుషన్‌గడ్డతండా, తిమ్మాపూర్, నాగ్సాన్‌పల్లి, రాయిలాపూర్, వెంకట్రావుపేటలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వడంతో పాటు రైతులు సాగు చేస్తున్న పోరంపోగు భూములను పట్టా భూములుగా మారుస్తామని చెప్పారు.

కాళేశ్వరం జలాలేవీ..?

వెంకటాపూర్ గ్రామంలో ప్రచారానికి వెళ్లిన సునీతారెడ్డిని స్థానికులు కాళేశ్వరం జలాలపై ప్రశ్నించారు. తాము భూములిచ్చినా ఇంతవరకు జలాలు రాలేదని, పింఛన్ అందడం లేదని, డబుల్ బెడ్రూం ఇవ్వలేదని నిలదీశారు. వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌రెడ్డి, చంద్రాగౌడ్, మన్సూర్, ఎంపీపీ రాజునాయక్, ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, మండల పార్టీ అధ్యక్షుడు సార రామాగౌడ్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సునీతారెడ్డి, పక్కన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

రోహిత్ ప్రచారాన్ని అడ్డుకునే యత్నం

దళితవాడలో కాంగ్రెస్, బీఆర్ఎర్ వర్గాల గొడవ



కార్యకర్తలతో మాట్లాడుతున్న రోహిత్

రామాయంపేట/నిజాంపేట(మెదక్): మెదక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్ రామాయంపేట దళితవాడలో ప్రచారం చేస్తుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు రోడ్డుకు బైక్‌లు అడ్డం పెట్టారు. ఆపై అడ్డుకునే యత్నం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తోపులాట చోటుచేసుకోగా ఈ గ్రూపుల నేతలు ఒకరినొకరు వ్యతిరేక నినాదాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రోహిత్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు తనను అడ్డుకోవడం దారుణమన్నారు. సేవా కార్యక్రమాలు చేపట్టినందుకా? తనను అడ్డుకుంటుంది అని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఆ పార్టీ నేతలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మెదక్‌లో జరిగిన అభివృద్ధి విషయమై తాను బహిరంగ చర్చ సిద్ధమని సవాల్ చేశారు. తన ప్రచారాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించిన నలుగురిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

సమస్యలుంటే సంప్రదించండి

- కలెక్టర్ రాజర్షిషా
- ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా సంజయ్‌కుమార్

మెదక్ కలెక్టరేట్: మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో త్వరలో జరుగునున్న అసెంబ్లీ ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా సంజయ్‌కుమార్ నియామకమైనట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఎన్నికలకు సంబంధించి సమస్యలు, సందేహాలు ఉంటే అభ్యర్థులు, ఓటర్లు ఆయన్ను సంప్రదించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను సంజయ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డింగ్ పని తీరును సమీక్షించారు. అలాగే, సీ-విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీమ్ పనితీరు, మీడియాలో వచ్చే వార్తలు, పేడ్ న్యూస్, పత్రికా ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా రికార్డింగ్ పని తీరును కలెక్టర్ సంజయ్‌కుమార్‌కు వివరించారు.

అనంతరం గ్రీవెన్స్ నోడల్ అధికారులు, ఎక్సైజ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని నియోజకవర్గంలో ఇప్పటి వరకు సీజ్ అయిన డబ్బు, మద్యం, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సంజయ్‌కుమార్ ఈనెల 4,5 తేదీలతో పాటు 9 నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు పర్యటన ఉంటుందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఏదైనా ఫిర్యాదు ఉంటే ప్రజలు, ప్రజాప్రతినిధులు సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య ఆయన్ను సంప్రదించాలన్నారు. అధికారిక నంబర్ 91770 30321, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ కృష్ణమూర్తి (98856 56367)ని ఆయనకు లైజన్ ఆఫీసర్‌గా నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న సంజయ్‌కుమార్, కలెక్టర్ రాజర్షిషా

జిల్లాలో 12 టీమ్‌ల ఏర్పాటు

మెదక్ కలెక్టరేట్: ప్రజాస్వామ్యంలో ఎన్నికల పాత్ర చాలా గొప్పదని, నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఎన్నికల నియామవళి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మెదక్ జిల్లాలో మొత్తం ఆరు టీమ్‌లను ఏర్పాటు చేశామని, మెదక్‌లో ఆరు, నర్సాపూర్‌లో ఆరు టీమ్‌లు పనిచేస్తాయని తెలిపారు. ప్రతి అభ్యర్థి తమ అనుమతితోనే ప్రచార సామగ్రి రవాణా చేయాలని సూచించారు. అభ్యర్థులు కొత్తగా జీరో అకౌంట్ ఓపెన్ చేయాలన్నారు.

బీసీలకే.. బీజేపీ

మెదక్ జిల్లాలో రెండు టికెట్లూ వారికే



మెదక్ బీజేపీ అభ్యర్థి విజయ్‌కుమార్



నర్సాపూర్ బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్

మెదక్: జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలనే సీఎం చేస్తామంటూ ఆది నుంచి బీజేపీ ప్రచారం చేస్తోంది. అందులో భాగంగా మెదక్, నర్సాపూర్ టికెట్లను విజయ్ కుమార్(ముదిరాజ్)కు, మురళీయాదవ్ (గొల్ల)కు కేటాయించింది. బీఆర్ఎస్ మాత్రం మెదక్ టికెట్‌ను సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి, నర్సాపూర్‌ను సునీతారెడ్డికి కేటాయించింది. కాంగ్రెస్ సైతం ఆ రెండు సీట్లను మైనంపల్లి రోహిత్‌రావుకు, రాజిరెడ్డికి కేటాయించింది. కాగా ఈ రెండు పార్టీలు అగ్రవర్ణాలకే టికెట్‌లు కేటాయించడం చర్చనీయాంశమైంది. మెదక్, నర్సాపూర్‌లో బీజేపీ అభ్యర్థులు ఇద్దరూ బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. మురళీయాదవ్ నర్సాపూర్‌లో మున్సిపల్ చైర్మన్ కాగా, ఉద్యమ సమయం నుంచి మొన్నటి వరకు పార్టీలోనే కొనసాగారు. ఆయన ఉమ్మడి మెదక్ జిల్లాలో జిల్లా అధ్యక్షుడిగా, భార్య రాజమణి సైతం ఉమ్మడి జిల్లాలో జెడ్పీ చైర్మన్‌గా పనిచేశారు. పార్టీలో అగ్రవర్ణాలదే ఆధిపత్యం సాగుతోందని, బీసీలకు ఎలాంటి ప్రాధాన్యం లేదని ఏడాది క్రితం.. మురళి ఏకంగా నిరసన తెలిపారు. దీంతో పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. వెంటనే ఆయన బీజేపీలో చేరితే అధిష్టానం గుర్తించి నర్సాపూర్ టికెట్ ఇచ్చింది. మెదక్ నియోజకవర్గం నిజాంపేటకు చెందిన విజయ్‌కుమార్ అధికార బీఆర్ఎస్ జెడ్పీటీసీ. జులైలో ఎమ్మెల్యే పద్మతో విభేదించి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయన బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావటంతో మెదక్ టికెట్‌ను పార్టీ కేటాయించింది. ఈ ఎన్నికల్లో ఎలా ఆదరిస్తారో వేచిచూడాల్సిందే.

ప్రలోభాలకు లొంగొద్దు

- వందశాతం పోలింగ్ సాధిద్దాం
- అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా ఓటేసి వందశాతం పోలింగ్ సాధిద్దామని అదనపు కలెక్టర్ రమేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం యువ ఓటర్లకు ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేశ్ మాట్లాడుతూ ఓటు విలువను తెలియజేసేవిధంగా రాష్ట్రంలోనే మొదటిసారిగా వినూత్నంగా 'విద్యార్థి హామీపత్రం'అనే కార్యక్రమాన్ని చేపట్టడం ఓటు విలువను తెలియజేస్తుందన్నారు. వందశాతం ఓటింగ్ లక్ష్యంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. స్వీప్ నోడల్ అధికారులు రాజిరెడ్డి, బ్రహ్మాజీ, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధ్యాపకులు, విద్యార్థులు

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు ఉండొద్దు

పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ అనిల్‌కుమార్

మెదక్ కలెక్టరేట్: వరిధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ అనిల్ కుమార్ అధికారులకు సూచించారు. శుక్రవారం మెదక్‌కు వచ్చిన ఆయన సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, పౌర సరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రపాల్, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లు, లారీల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైస్ మిల్లుల వద్ద ధాన్యం లారీలు ఒక రోజు కంటే ఎక్కువ ఆగకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు సూచించారు. ధాన్యం వెనువెంటనే తరలించాలన్నారు. అనంతరం చిన్న శంకరంపేట మండలం గవ్వలపల్లి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వారికి తగు సూచనలు చేశారు.

టెన్త్ వార్షిక పరీక్షల ఫీజు 17లోగా చెల్లించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి వార్షిక పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. ఈ మేరకు వివరాలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం వెల్లడించారు. జిల్లాలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల17 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబర్ 1 వరకు, రూ.200తో 11వరకు, రూ.500 డిసెంబర్ 20వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. రెగ్యులర్ విద్యార్థులు రూ.125, మూడు సబ్జెక్టులు, అంత కంటే తక్కువ సబ్జెక్టులు ఫెయిలైన వారు రూ.110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఫెయిలైనవారు రూ.125, వొకేషనల్ విద్యార్థులు రూ. 60 చెల్లించాల్సి ఉంటుందన్నారు.



బీడీలు చుడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత, కౌన్సిలర్లు

బీడీలు చుడుతూ.. పథకాలను వివరిస్తూ..

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం జోరందుకుంది. బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి , ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూం కాలనీలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీలు చుడుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సులోచన, మీన, కల్పన, యాదమ్మ, రజిత బీఆర్ఎస్ మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



శాలిపేట హోటల్‌లో టీ తాగుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

ప్రచారం.. కాసేపు విరామం

చిన్నశంకరంపేట(మెదక్): పేట మండలం ఖాజాపూర్‌తండా, ఖాజాపూర్, కుమ్మరిపల్లి, రామాయపల్లి, శాలిపేట, చెన్నాయిపల్లి, వెంకట్రావుపల్లి, మడూర్ గ్రామాల్లో శుక్రవారం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార సమయంలో కాసేపు శాలిపేటలోని ఓ హోటల్ టీ తాగారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.



పత్తి చేనులో ప్రచారం చేస్తున్న నాయకులు

పత్తి చేనులో ప్రచారం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిమ్మాపూర్, అనంతసాగర్, గోపాల్‌పూర్ గ్రామాల్లో శుక్రవారం బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామంలో పార్టీ నాయకులు పత్తి ఏరుతున్న కూలీల దగ్గరకు వెళ్లి అక్కా బాగున్నారా.. అవ్వా మంచిగున్నారా అంటూ ఆత్మీయంగా పలకరిస్తూ ప్రచారం చేశారు. కారు.. సర్కారు..కేసీఆర్‌కు ఓటు వేయాలంటూ అభ్యర్థించారు.




వర్గల్ మండలం మైలారంలో డప్పు కొడుతున్న వంటేరు

డప్పుకొట్టి.. దరువేసి

వర్గల్(గజ్వేల్): ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం వర్గల్ మండలం మైలారంలో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ప్రచారానికి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వచ్చారు. ఇనుమడించిన ఉత్సాహంతో ర్యాలీలో చేరిపోయి డప్పుకొట్టి దరువేశారు. కార్యకర్తల్లో నూతనోత్సాహం కలిగించారు.

అందోల్ కోటలో గెలుపెవరిది..?

- తొమ్మిది సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, రెండు సార్లు బీఆర్ఎస్
- హ్యాట్రిక్ కోసం అధికార పార్టీ గురి
- పదో విజయంపై కాంగ్రెస్ కన్ను
- తీవ్రంగా శ్రమిస్తున్న ప్రధాన పార్టీలు



వట్‌పల్లి(అందోల్): రాష్ట్ర రాజకీయాల్లో 'అందోలు' నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి నుంచి గెలుపొందిన మెజార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉప ముఖ్యమంత్రులయ్యారు. 1952లో అందోల్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి 16 సార్లు ఎన్నికలు జరిగితే రెండు సార్లు మాత్రమే స్థానిక ఎమ్మెల్యేలు గెలుపొందగా, మిగితా వాటిలో స్థానికేతరులు గెలుపొందారు.

నియోజకవర్గంలోని ఓటర్లు			
మండలం	పురుషులు	స్త్రీలు	మొత్తం
అందోలు	22,438	23,670	46,109
అల్లాదుర్గం	11,371	11,933	23,304
రేగోడ్	9,082	9,292	18,374
టేక్మాల్	13,725	14,724	28,450
పుల్కల్	10,937	11,389	22,326
రాయికోడ్	16,136	15,650	31,787
మునిపల్లి	16,371	16,495	32,866
వట్‌పల్లి	12,452	12,602	25,055
చౌటకూర్	8,382	8755	17,138

మొత్తంగా తొమ్మిది సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు టీడీపీ, బీఆర్ఎస్ రెండు సార్లు, ఒకసారి ఇంటిపెండింట్ గెలుపొందాయి.

1952 నుంచి 1967 వరకు జనరల్ క్యాటగిరీ ఉండగా, 1967 నుంచి అందోల్ నియోజకవర్గాన్ని ఎస్సీలకు రిజర్వు చేశారు. రిజర్వుడు నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత 12 సార్లు జరిగిన ఎన్నికల్లో రాజనర్సింహ కుటుంబ సభ్యులే ఆరుసార్లు ఎన్నికయ్యారు. 1985, 1994 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి మల్యాల రాజయ్య గెలుపొందగా ఆర్థిక, గృహ నిర్మాణ మంత్రిత్వ శాఖలను నిర్వహించాడు. బాబూ మోహన్ 1998 ఉప ఎన్నిక , 1999 ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలుపొంది కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున పోటీ చేసి గెలుపొందారు.

1989, 2004, 2009 ఎన్నికల్లో దామోదర రాజనర్సింహ కాంగ్రెస్ తరఫున పోటీ చేసి మూడుసార్లు గెలుపొంది. మార్కెట్, వ్యవసాయ, విద్య, ఉప ముఖ్యమంత్రి పదవులను పొందాడు. అలాగే, ఓపెన్ కేటగిరి సమయంలో జోగిపేటకు చెందిన వ్యక్తి వైశ్యుడైన బస్వ మాణయ్య స్థానిక మొదటి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఆ తర్వాత 14 సార్లు ఎన్నికలు జరుగగా స్థానికేతరులే గెలుపొందారు. 1967లో రిజర్వుడు తర్వాత స్థానికులకు పోటీ చేసేందుకు అవకాశాలు లభించలేదు. 2018 ఎన్నికల నాటికి స్థానిక నినాదం బలపడింది. దీంతో ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో వట్‌పల్లి మండలంలోని పోతులబోగుడాకు చెందిన చంటి క్రాంతికిరణ్ విజయం సాధించడంతో రెండోసారి ఎమ్మెల్యే వ్యక్తి గెలిచారు.

అందోలు ఎమ్మెల్యేలు		
1952	వెంకట రాజేశ్వర జ్యోషి	(కాంగ్రెస్)
1957	బస్వ మాణయ్య	(స్వతంత్ర)
1962	ఎస్.లక్ష్మీదేవి	(కాంగ్రెస్)
1967	రాజనర్సింహ	(కాంగ్రెస్)
1972	రాజనర్సింహ	(కాంగ్రెస్)
1978	రాజనర్సింహ	(కాంగ్రెస్)
1983	హెచ్.లక్ష్మణ్ జీ	(కాంగ్రెస్)
1985	మల్యాల రాజయ్య	(టీడీపీ)
1989	దామోదర్	(కాంగ్రెస్)
1994	మల్యాల రాజయ్య	(టీడీపీ)
1998	పి.బాబుమోహన్	(టీడీపీ)
1999	పి.బాబుమోహన్	(టీడీపీ)
2004	దామోదర	(కాంగ్రెస్)
2009	దామోదర	(కాంగ్రెస్)
2014	బాబుమోహన్	(టీఆర్ఎస్)
2018	చంటి క్రాంతికిరణ్	(టీఆర్ఎస్)

జంగ్ తెలంగాణ

ఆ ఆరుగురి చుట్టే నర్సాపూర్





గుండం వీరయ్య



విఠల్‌రెడ్డి



జగన్నాథరావు



సునీతారెడ్డి



మదన్‌రెడ్డి

- ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు
- విఠల్‌రెడ్డి ఐదు, జగన్నాథరావు మూడుసార్లు విజయం
- గుండం వీరయ్య, జయరాంరెడ్డి ఒక్కోసారి..
- మదన్‌రెడ్డి రెండు, సునీతారెడ్డి మూడుసార్లు గెలుపు

నర్సాపూర్: నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గం 1952 సంవత్సరంలో ఏర్పాటైంది. ఇప్పటి వరకు 15 సార్లు శాసనసభ ఎన్నికలు జరుగగా ఆరుగురు వ్యక్తుల చుట్టే విజయం తిరిగింది. 1952 నుంచి జరిగిన పలు ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందిన జయరాంరెడ్డి, గుండం వీరయ్య, చిలుముల విఠల్‌రెడ్డి, చౌటి జగన్నాథరావు మృతిచెందారు. కాగా సిట్టింగ్ ఎమ్మెల్యేగా చిలుముల మదన్‌రెడ్డి కొనసాగుతుండగా ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్యే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా సునీతారెడ్డి పోటీ పడుతున్నారు.

1952లో మొదటిసారి ఎన్నికలు

1952 సంవత్సరంలో మొదటిసారి నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గానికి ఎన్నికలు జరుగగా కాంగ్రెస్ నుంచి జయరాంరెడ్డి పోటీ చేసి సోషలిస్టు కూటమి అభ్యర్థిగా పోటీ చేసిన భగవాన్‌దాస్‌పై విజయం సాధించారు. 1957లో కాంగ్రెస్ అభ్యర్థిగా గుండం వీరయ్య పోటీ చేసి పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేసిన చిలుముల విఠల్‌రెడ్డిపై గెలుపొందారు. 1962లో చిలుముల విఠల్‌రెడ్డి సీపీఐ నుంచి మొదటిసారి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి చౌటి జగన్నాథరావుపై గెలుపొందారు. 1967, 1972 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ నుంచి పోటీ చేసిన చిలుముల విఠల్‌రెడ్డిపై కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన చౌటి జగన్నాథరావు వరుసగా రెండు సార్లు గెలుపొందారు. 1978లో కాంగ్రెస్ అభ్యర్థి చౌటిజగన్నాథరావుపై సీపీఐ అభ్యర్థి విఠల్‌రెడ్డి గెలుపొందగా, 1983లో సీపీఐ అభ్యర్థి చిలుముల విఠల్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి చౌటి జగన్నాథరావు గెలుపొందారు.

హ్యాట్రిక్ సాధించిన విఠల్‌రెడ్డి

1985, 1989, 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి జగన్నాథరావుపై సీపీఐ నుంచి పోటీ చేసిన చిలుముల విఠల్‌రెడ్డి వరుసగా మూడుసార్లు గెలుపొంది నర్సాపూర్ ఎమ్మెల్యేగా మొదటిసారి హ్యాట్రిక్ సాధించారు. అలాగే, 1999లో అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన వాకిటి సునీతారెడ్డి రెండు రికార్డులు సాధించారు. 1999 ఎన్నికల్లో గెలుపొంది నర్సాపూర్ నుంచి గెలుపొందిన మొదటి మహిళా ఎమ్మెల్యేగా రికార్డు పొందారు. అంతేగాక నర్సాపూర్ ఎమ్మెల్యేగా వరుసగా మూడుసార్లు (1999, 2004, 2009) గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు.

రెండు సార్లు మదన్‌రెడ్డి

1999, 2004లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా మదన్‌రెడ్డి రెండు సార్లు ఓటమి చవిచూడగా ప్రత్యేక రాష్ట్రంలో రెండుసార్లు వరుసగా గెలుపొందారు. 2014లో జరిగిన ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన చిలుముల మదన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి (హ్యాట్రిక్ ఎమ్మెల్యే) సునీతారెడ్డిపై గెలుపొందారు. 2018లో సైతం సునీతారెడ్డిపై రెండోసారి విజయం సాధించారు.

మీ ఓటు మా ఆయనకే..



ప్రచారం చేస్తున్న చంద్రశేఖర్ భార్య ప్రమీల

జహీరాబాద్: జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎ.చంద్రశేఖర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన భార్య ప్రమీల శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలోని 2వ వార్డులో ప్రజలతో మాట్లాడారు. పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్‌ని గెలిపిస్తే ప్రజా సమస్యలు తీరుతాయన్నారు. ఈ సందర్భంగా పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె వెంట మాజీ కౌన్సిలర్లు కండెం సుజాత, తాహెరాబేగం నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న రాజమణి మురళీయాదవ్

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్ నియోజకవర్గంలో సునీతారెడ్డి, మదన్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని, ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇస్తే అభివృద్ధి చేస్తామని ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన హత్నూరలో బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్‌కు మద్దతుగా ఆయన సతీమణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నాగ ప్రభుగౌడ్, నాయకులు నీరుడి అశోక్, సతీష్ యాదవ్, రవి, సుధాకర్, సతీష్, నాయకులు పాల్గొన్నారు.

'డబుల్ బెడ్రూం' వచ్చాయా?

- హామీలను విస్మరించిన సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్



గ్యారంటీ పథకాలను వివరిస్తున్న పొన్నం

అక్కన్నపేట(హుస్నాబాద్): కాంగ్రెస్ ఇచ్చిన ఇందిరమ్మ పథకం ఇళ్లలో అల్లుడు వస్తే ఏడ ఉంటాడు.. అని చెప్పిన సీఎం కేసీఆర్ మీ ఊరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చాడా? అని కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌గౌడ్ ప్రజలను అడిగారు. అక్కన్నపేట మండలంలోని మంచి నీళ్లబండ, కేశవాపూర్, గొల్లపల్లి, మల్లంపల్లి, మోత్కులపల్లి, పెద్దతండా గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందన్నారు. రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, కాకతీయ యూనివర్సిటీ రిటైర్ ప్రొఫెసర్ వీరన్ననాయక్, అక్కన్నపేట గ్రామ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క బూత్‌లో 1,400 మంది ఓటర్లే

నారాయణఖేడ్: ఎన్నికల నిర్వహణలో ప్రతీ పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,400 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా అధికారులు చూస్తారు. ఈ సంఖ్యను ఎందుకు పరిమితం చేశారంటే.. ఈవీఎంలకు అనుసంధానించి ఉండే వీవీ ప్యాట్‌లో థర్మల్ కాగితం పొందుపరుస్తారు. ఈ కాగితం 1,500 స్లిప్పులను మాత్రమే ప్రింట్ చేస్తుంది. 22.5 ఓల్ట్‌ల బ్యాటరీతో పనిచేసే వీవీ ప్యాట్‌లో ఓటు ఎవరికి వేసిందనేది డిస్‌ప్లేలో కనిపిస్తుంది. ఇందులో వంద వరకు కాగితపు స్లిప్పులు పోలింగ్ రోజున మాక్ పోలింగ్ ప్రక్రియ కోసం ఖర్చవుతాయి. అందుకే ప్రతీ పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,400మంది లోపు వరకు మాత్రమే ఓటర్లు ఉండేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది.


రూ.28.50 లక్షలు స్వాధీనం



నగదు చూపుతున్న ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బెజ్జంకి క్రాసింగ్ రహదారిపై శుక్రవారం ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో పోలీసులు రూ.28.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట నుంచి వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా ముగ్గురు వ్యక్తులు ఎలాంటి పత్రాలు లేకుండా డబ్బులు తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మానకొండూర్ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించామన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కనకయ్య, పీసీలు బాలరాజు, రవి, సంతోష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరస్తుడిని పీసీసీ అధ్యక్షుడిగా నియామకం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బండ ప్రకాశ్

రామాయంపేట(మెదక్): ఒక ఆర్థిక నేరస్తుడిగా ముద్రపడ్డ , ఓటుకు నోటు కేసులో పట్టుబడ్డ వ్యక్తిని పీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన రామాయంపేటలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రం బీసీలకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి, ముదిరాజ్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాయకులుంటే సరిపోతుందా..?

ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలం తునికిలో శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కానీ, ప్రజలు ఎక్కువగా లేకపోవడంతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అసహనానికి గురయ్యారు. ఇతర గ్రామాల నుంచి వచ్చిన నాయకులతోపాటు కొంత మంది స్థానికులు మాత్రమే ఉన్నారు. ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్, ఉపసర్పంచ్ ఇతర నాయకులు ఉన్నప్పటికీ ఎన్నికల ప్రచారం గురించి ప్రజలకు చెప్పలేదా అని ప్రశ్నించారు. నాయకులు ఉంటే సరిపోదని ప్రజలు ఉండాలన్నారు. ఓటర్లు అంతా కారు గుర్తుకే ఓటు వేసేలా చూడాలన్నారు.



ప్రచారంలో కనిపించని ప్రజలు

మోసకారి కేసీఆర్‌కు బుద్ధి చెప్పండి

జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించి, నమ్మక ద్రోహం చేసిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కడవేర్గు, పోతిరెడ్డి పల్లె, పెద్దరాజుపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలన్నారు. ఈ ప్రాంత రైతుల కష్టాలు తీర్చేందుకు నిర్మించిన తపాసుపల్లి డ్యాం నుంచి నీటిని సిద్దిపేటకు తరలించేందుకు ఒప్పుకోనందుకే తనను పార్టీ నుంచి వెళ్లిపోయేలా చేశాడన్నారు. ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే తపాస్‌పల్లి డ్యాం నుంచి సిద్దిపేటకు నీటిని తరలించే కాల్వలను మీ అందరి సహకారంతో, మీ సమక్షంలోనే కూల్చివేస్తానన్నారు. అలాగే, ఆయా గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీఫ్లోర్ లీడర్ గిరి కొండల్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ చెవిటి లింగం, పీఏసీఎస్ డైరెక్టర్ కొమ్ము రవి, పార్టీ మండల అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ నర్సింగరావు, నాయకులు పరమేశ్వర్, భాస్కర్‌రెడ్డి, ఆగంరెడ్డి, యాదగిరి, రాకేశ్ కృష్ణ, లాల్‌మహ్మద్, సంతోష్, శ్రీకాంత్, సన్నీ, విజయ్, శ్రీనివాస్, మల్లేశం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కడవేర్గులో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

పల్లాను భారీ మెజార్టీతో గెలిపించండి

ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి, తాటికొండ

చేర్యాల(సిద్దిపేట): సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జనగామ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే చేర్యాల ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తాడని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని 7,8,9,10 వార్డుల్లో పల్లాకు మద్దతుగా ఆయన సతీమణి నీలిమ, కుమారుడు అనురాగ్‌లు నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే చేర్యాల ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఆప్కో చైర్మన్ మండల శ్రీరాములు, మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపరాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ సుంకరి మల్లేశం, మున్సిపల్ కౌన్సిలర్లు మంగోలు చంటి, ఆడెపు నరేందర్, పచ్చిమడ్ల సతీష్ గౌడ్, జుబేదా ఖతూన్, మార్కెట్ వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, పార్టీ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, కోతి విజయ్, మాజీ సర్పంచ్ ముస్త్యాల అరుణ, మాజీ ఉపసర్పంచ్ మంచాల కొండయ్య, నాయకులు తాడెం రంజిత, మేడిశెట్టి ఉమ, పచ్చిమడ్ల మానస, శివగారి అంజయ్య, బుడిగె గురువయ్య, నాగమల్ల శ్రీనివాస్, యాట భిక్షపతి, రావుల ఉమేశ్, పచ్చిమడ్ల సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, పల్లా సతీమణి నీలిమ

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఎస్పీ రోహిణీప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ రోహిణీప్రియదర్శిని సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని అన్నారు. మద్యం సేవించి, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే నడిపిన వారిపై, ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. 2022 సంవత్సరంలో పలు విభాగాలకు సంబంధించి కేసుల వివరాలు వెల్లడించారు. సీటు బెల్టు పెట్టుకోనివి-8,200, సెల్‌ఫోన్ డ్రైవింగ్-1,943, హెల్మెట్ లేకుండా - 32,099, డ్రంకెన్‌డ్రైవ్ - 8,642, ఓవర్ స్పీడ్ - 75,403, చిన్న డ్రైవింగ్ కేసులు - 2,460, ట్రిపుల్ రైడింగ్ - 10,346 ఓవర్ లోడింగ్-359 కేసులు నమోదైనట్లు తెలిపారు. అలాగే, 2022లో మొత్తం ప్రమాదాల సంఖ్య - 522 కాగా, 263 మంది చనిపోయినట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో కూడా మార్పు రావాలని కోరారు.

